శుక్రవారం 26-7-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 405 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD


మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com



## మాదాపూర్ లో రేవ్ పార్టీ కలకలం

మిగతా 2లో



## చెరువులో 16 ఫోన్లు స్వాధీనం

మిగతా 2లో



## జలమయంగా ముంబై మహానగరం

మిగతా 3లో



## పాము కాటుతో మరణిస్తే పరిహారం

మిగతా 5లో

# తెలంగాణ బడ్జెట్ రూ.2,91,159 కోట్లు

- అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన భట్టి
- రూ.57,112 కోట్ల అప్పులు తీసుకోవాలని ప్రతిపాదన
- నిజాం షుగర్స్‌ను తిరిగి ప్రారంభిస్తామని వెల్లడి

ముందడుగు తెలంగాణ:

తెలంగాణ శాసనసభలో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో పూర్తిస్థాయి పద్దును ప్రవేశపెట్టారు. రూ.2,91,159కోట్లతో బడ్జెట్‌ను సభ ముందుకు తీసుకొస్తున్నట్లు మంత్రి తెలిపారు. దీనిలో మూలధన వ్యయం రూ.33,487 కోట్లుగా చెప్పారు. పన్ను ఆదాయం 1,38,181.26 కోట్లు, పన్నేతర ఆదాయం రూ.35,208.44 కోట్లు, కేంద్ర పన్నుల్లో వాటా 26.216.28 కోట్లు, కేంద్రం గ్రాంట్లు 21,636.15 కోట్లుగా పేర్కొన్నారు. ఈ ఏడాది రూ.57,112 కోట్ల అప్పులు తీసుకోవాలని ప్రతిపాదించారు. నిజాం షుగర్స్‌ను తిరిగి ప్రారంభిస్తామని భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు.

### రాష్ట్ర బడ్జెట్ స్వరూపమిదీ..

ఆర్థిక లోటు అంచనా రూ.49,255.41 కోట్లు
ప్రాథమిక లోటు అంచనా రూ.31,525.63 కోట్లు
రెవెన్యూ మిగులు అంచనా రూ.297.42 కోట్లు
వ్యవసాయానికి రూ.72,659 కోట్లు
ఉద్యానశాఖకు రూ.737కోట్లు
పశుసంవర్ధశాఖకు రూ.1,980కోట్లు
రూ.500 గ్యాస్ సిలిండర్ పథకానికి రూ. 723కోట్లు
గృహజ్యోతికి రూ.2,418కోట్లు
ప్రజాపంపిణీ వ్యవస్థకు రూ.3836కోట్లు
పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు రూ.29,816 కోట్లు



రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్)కు రూ.1,525 కోట్లు
స్త్రీ, శిశు సంక్షేమానికి రూ. 2,736 కోట్లు
ఎస్సీ సంక్షేమం రూ.33,124కోట్లు
ఎస్టీ సంక్షేమం రూ.17,056కోట్లు
మైనార్టీ సంక్షేమం రూ.3,003కోట్లు
బీసీ సంక్షేమం రూ.9,200 కోట్లు
వైద్య, ఆరోగ్యం రూ. 11,468 కోట్లు
ట్రాన్స్‌కో, డిస్కంలకు రూ.16,410 కోట్లు
అడవులు, పర్యావరణం రూ.1,064 కోట్లు
పరిశ్రమల శాఖకు రూ. 2,762 కోట్లు
ఐటీ శాఖకు రూ.774 కోట్లు
నీటిపారుదల రంగానికి రూ.22,301 కోట్లు
విద్యకు రూ.21,292 కోట్లు
హోంశాఖకు రూ.9,564కోట్లు
రోడ్లు, భవనాల శాఖకు రూ.5,790 కోట్లు

TELANGANA BUDGET



## కథ చెప్పినట్టే ఉంది.. బడ్జెట్ పెట్టినట్టు లేదు

- ఇది పూర్తిగా రైతు శత్రు ప్రభుత్వం
- ప్రజల ఆశలపై నీళ్లు చల్లిన రాష్ట్ర బడ్జెట్
- బిఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నేత కేసీఆర్ విమర్శ

ముందడుగు తెలంగాణ:

కథ చెప్పారు తప్ప.. బడ్జెట్ పెట్టినట్టు అనిపించలేదు. తెలంగాణ బడ్జెట్‌లో వ్యవసాయ, పారిశ్రామిక, ఐటీ పాలసీలపై నిర్దిష్టమైన విధానం లేదని బిఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నేత కేసీఆర్ విమర్శించారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. "బిఆర్ఎస్ హయాంలో మేం రెండు పంటలకు రైతుబంధు ఇచ్చాం. కాంగ్రెస్ ప్రభుత్వం దీన్ని ఎగ్గొడతామని చెబుతోంది. మేం రైతులకిచ్చిన డబ్బును దుర్వినియోగం చేసినట్లు ఆరోపిస్తున్నారు. ఇది పూర్తిగా రైతు శత్రు ప్రభుత్వమని తెలుస్తోంది. ధాన్యం కొనుగోలు చేయలేదు. విద్యుత్, నీటి సరఫరా, గొర్రెల పంపిణీ లేదు. రైతు భరోసా గురించి ప్రస్తావనే లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, వృత్తి కార్మికులను వంచించింది. రాష్ట్ర బడ్జెట్ ప్రజల ఆశలపై నీళ్లు చల్లింది. ఇది పేదల,

మిగతా 2లో

## ఉపాధ్యాయురాలిగా మారిన రాష్ట్రపతి ముర్ము

గ్లోబల్ వార్మింగ్‌పై విద్యార్థులకు బోధన

ముందడుగు ఢిల్లీ:

భారత ద్రౌపదీ ముర్ము తనకెంతో ఇష్టమైన వృత్తి అయిన ఉపాధ్యాయురాలిగా మారారు. ప్రెసిడెంట్ ఎస్టేట్‌లోని

మిగతా 2లో



## కేజ్రీవాల్ ఆరోగ్యంపై ఇండియా కూటమి ఆందోళన

బరువు తగ్గారని ఆప్ నేతల ఆందోళన ○ ఢిల్లీలో నిరసనలకు కూటమి నేతలు సిద్ధం

ముందడుగు ఢిల్లీ:

తిహార్ జైలులో ఉన్న ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోగ్యంపై 'ఇండియా' కూటమి ఆందోళన వ్యక్తం చేసింది. ఆయన ఆరోగ్యం విషయంలో అధికార వర్గాల వైఖరిపై త్వరలో

మిగతా 2లో



ముందడుగు శుక్రవారం, 26-7-2024, హైదరాబాద్

# కథ చెప్పినట్టే ఉంది.. బడ్జెట్ పెట్టినట్టు లేదు

(మొదటిపేజీ తరువాయి)

రైతు బడ్జెట్ కాదు.

**దళితులంటే ప్రభుత్వానికి ప్రేమ లేదు**

రైతు భరోసాలో అనేక ఆంక్షలు పెడుతున్నట్టు చెప్పారు. ప్రజల గొంతు కోసింది ఈ ప్రభుత్వం. దళితబంధు పథకం ప్రస్తావన లేదు. దళితులంటే ప్రభుత్వానికి ఉన్న ప్రేమ ఇదేనా? గొర్రెల పెంపకం పథకానికి తూట్లు పొడిచారు. ఒత్తి పలకడం తప్ప భట్టి కొత్తగా చెప్పిందేమీ లేదు. రైతులను పొగిడినట్టే పొగిడి నిండా ముంచారు. బడ్జెట్ ఒట్టి డొల్ల. అన్ని వర్గాలను మోసం చేసింది. పేదల కోసం ఒక్క పాలసీ అయినా ప్రకటించారా? బడ్జెట్‌లో ఒక పద్దు.. పద్ధతి లేదు. బడ్జెట్‌పై ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతాం. యాదవులు, మత్స్యకారులను ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రభుత్వానికి ఆరు నెలల సమయం ఇచ్చాం. ఈ ప్రభుత్వానికి పాలసీ లేదని బడ్జెట్ చూసిన తర్వాత అర్థమైంది. ఐటీ, పారిశ్రామిక పాలసీ ఏది? ఏ ఒక్క కొత్త సంక్షేమ పథకం ప్రకటించలేదు" అని కేసీఆర్ విమర్శించారు.

# ఉపాధ్యాయురాలిగా మారిన రాష్ట్రపతి ముర్ము

(మొదటిపేజీ తరువాయి)

డా.రాజేంద్ర ప్రసాద్ కేంద్రీయ విద్యాలయ పాఠశాలకు వెళ్లి విద్యార్థులను ఆశ్చర్యపర్చారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. తొలుత విద్యార్థుల పేర్లు అడిగి వారితో ముచ్చటించారు. వారి అభిరుచులు, లక్ష్యాలు తెలుసుకున్నారు. ఈ తరం విద్యార్థులు ఎంతో ప్రతిభావంతులని, సాంకేతికంగా వీరికి పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని ముర్ము అన్నారు. అనంతరం 'గ్లోబల్ వార్మింగ్'పై వారికి బోధించారు. భావితరాల కోసం పర్యావరణాన్ని కాపాడుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. నీటి సంరక్షణ ప్రాముఖ్యాన్ని వివరించారు. పర్యావరణ మార్పు ప్రభావం మనపై పడకుండా ఉండాలంటే వీలైనన్ని ఎక్కువ మొక్కలు నాటాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈసందర్భంగా ప్రధాని మోదీ పిలుపునిచ్చిన 'ఏక్ పేడ్ మా కే నామ్ (అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి)' గురించి ప్రస్తావించారు. ప్రతీ విద్యార్థి తమ పుట్టిన రోజున ఓ మొక్క నాటాలని ఆకాంక్షించారు.

# కేజ్రీవాల్ ఆరోగ్యంపై ఇండియా కూటమి ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

త్వరలో ఢిల్లీలో నిరసనలను కూటమి నేతలు సిద్ధమవుతున్నారు. ఈ విషయాన్ని ఆప్ గురువారం వెల్లడించింది. జులై 30న విపక్ష కూటమి పార్టీల ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన తెలుపుతామని ఆప్ ప్రకటించింది. కేంద్రంలోని బిజెపి కేజ్రీవాల్ హత్యకు కుట్ర పన్నుతోందని మరోసారి ఆరోపించింది. కాగా.. మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన కేజ్రీవాల్ ప్రస్తుతం తిహాడ్ జైల్లో ఉన్నారు. కారాగారానికి వెళ్లిన తర్వాత ఆయన 8.5 కిలోల బరువు తగ్గారని.. ఆయన చక్కెర స్థాయిలు ఐదుసార్లు 50 కంటే తక్కువకు పడిపోయాయని ఆప్ నేతలు పేర్కొన్నారు. ఇవి కేవలం ఆరోపణలు మాత్రమేనని జైలు అధికారులు



ఖండించిన సంగతి తెలిసిందే. కేజ్రీవాల్ ఉద్దేశపూర్వకంగానే ఆహారాన్ని తక్కువగా తీసుకుంటున్నారని.. అదే ఆయన బరువు తగ్గడానికి కారణమని ఢిల్లీ గవర్నర్ వీకే సక్సేనా ఆరోపించారు. దీనిపై స్పందించిన ఆప్ ఆయన వ్యాఖ్యలను ఖండించింది.

# చెరువులో 16 ఫోన్లు స్వాధీనం

## టవర్ సిగ్నల్స్ ద్వారా ట్రాక్ చేసి రికవరీ ౦ నీట్ పరీక్ష పేపర్ లీక్ దర్యాప్తులో సీబీఐ వేగం




ముందడుగు జాతీయం:


దేశంలో జరిగిన నీట్ పరీక్ష పేపర్ లీక్ దర్యాప్తులో సీబీఐ వేగం పెంచింది. ఝార్ఖండ్‌లోని ధన్‌బాద్‌కు చెందిన నిందితుడు అవినాష్ అలియాస్ బంటీకి సంబంధించిన 16 ఫోన్లను సీబీఐ అధికారులు చెరువులోంచి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. నిందితుడిని బిహార్‌లోని పట్నా సీబీఐ కోర్టులో హాజరుపరచగా విచారణ నిమిత్తం జులై 30 వరకు న్యాయస్థానం కస్టడీకి అప్పగించింది. అంతకుముందు ప్రాథమిక విచారణ సందర్భంగా కేసు గురించి బంటీ కీలక విషయాలు బయటపెట్టినట్లు సమాచారం. పేపర్ లీక్‌కు ఉపయోగించిన 16 ఫోన్లను నిందితుడు చెరువులో పడేయగా టవర్ సిగ్నల్స్ ద్వారా ట్రాక్ చేసి రికవరీ చేసినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. పేపర్ లీక్‌లో అరెస్టయిన శశి పాసవాన్‌తో నిందితుడికి సంబంధాలు ఉన్నట్లు సమాచారం. ఈ ఏడాది మే నెలలో దేశవ్యాప్తంగా జరిగిన నీట్-యూజీ పరీక్షలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ అంశంపై సీబీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది.

# మాదాపూర్ లో రేవ్ పార్టీ కలకలం

## పోలీసుల అదుపులో యువకులు, మహిళలు

ముందడుగు హైదరాబాద్:

హైదరాబాద్ నగరంలో మరోసారి రేవ్ పార్టీ కలకలం సృష్టించింది. మాదాపూర్ హైటెక్ సిటీ సైబర్ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో రేవ్ పార్టీ జరుగుతుండగా తెలంగాణ టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేశారు. 14 మంది యువకులు, ఆరుగురు



మహిళలను అదుపులోకి తీసుకున్నారు. ఐదుగురు నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. మిగిలినవారికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు పోలీసులు. ఇందులో కొందరు డ్రగ్స్ తీసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. రేవ్ పార్టీలో ఒక గ్రాము కొకైన్, రెండు గ్రాముల ఎండీఎంఏ, 0.84 గ్రాముల ఓజీ ఖుష్, మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. బేగంపేట ప్రాంతానికి చెందిన స్థిరాస్తి వ్యాపారి నాగరాజు, మరో రియల్టర్ సాయి కుమార్, బీటెక్ విద్యార్థులు, ఈవెంట్ ప్రమోటర్ కిశోర్ ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# ఆంధ్రప్రదేశ్ అప్పులు రూ.10లక్షల కోట్లు

## శ్వేతపత్రం సిద్ధం చేసిన ఏపీ ప్రభుత్వం

ముందడుగు ఆంధ్రప్రదేశ్:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఐదేళ్ల వైకాపా పాలనలో అప్పుల్లో కూరుకు పోయిందని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ఆదాయం, అప్పుల వివరాలను ప్రజల ముందుంచేందుకు సీఎం సిద్ధమయ్యారు. శుక్రవారం శాసనసభలో ఆర్థికశాఖపై శ్వేతపత్రం విడుదల చేయనున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై లోతుగా అధ్యయనం చేసిన కూటమి ప్రభుత్వం 2019-24 మధ్య పెండింగ్ బిల్లులు రూ.1,41,588 కోట్లు ఉన్నట్లు గుర్తించింది. ఉద్యోగులు, కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు రూ.వేల కోట్లు ఉన్నట్లు తేల్చింది. పెండింగ్ బిల్లుల్లో రూ.93వేల కోట్లు సీఎఫ్ఎంఎస్‌లోకి అప్‌లోడ్ చేయలేదని, రూ.48వేల కోట్లు



మేర బిల్లులు అప్‌లోడ్ చేసినా చెల్లింపులు చేయలేదని నిర్ధరించింది. భారీగా నీటిపారుదలశాఖ, పోలవరం బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వివిధ ప్రాజెక్టులకు చెందిన రూ.19,324 కోట్ల మేర బకాయిలు గుర్తించారు. ఆర్థిక శాఖ నుంచి రూ.19,549 కోట్లు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో రూ.14వేల కోట్లు, మున్సిపల్ శాఖలో రూ.7,700 కోట్లు పెండింగ్ బిల్లులు ఉన్నాయి. మొత్తంగా రాష్ట్ర అప్పులు రూ.10లక్షల కోట్ల వరకు ఉంటాయని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ వివరాలను శ్వేతపత్రం ద్వారా ప్రభుత్వం వెల్లడించనుంది.

ముందడుగు
శుక్రవారం, 26-7-2024, హైదరాబాద్



## వలపు జుగల్ బందీ

రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. హరీష్‌శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మాత. ఆగస్ట్ 15న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్ వేగవంతం చేశారు. గురువారం సెకండ్ సింగిల్ 'రెప్పల్ డప్పల్'ను విడుదల చేశారు. 'బొమ్మ సోకులో బొంబాయి జాతరే..తెలుగు, తమిళ, హిందీ..వలపు జుగల్ బందీ' అంటూ మాస్ బీట్‌తో ఈ పాట సాగింది. మిక్కీ జే మేయర్ స్వరపరచిన ఈ గీతాన్ని కాసర్ల శ్యామ్ రచించారు. అనురాగ్ కులకర్ణి, మంగ్లీ ఆలపించారు. నాయకానాయికలు రవితేజ, భాగ్యశ్రీ బోర్సే డ్యాన్స్ ఆకట్టుకుంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తనదైన శైలి కామెడీ టచ్‌తో దర్శకుడు హరీష్‌శంకర్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, రచన-దర్శకత్వం: హరీశ్‌శంకర్.

# జలమయంగా ముంబై మహానగరం

నదులను తలపిస్తున్న రోడ్లు, లోతట్టు ప్రాంతాలు ■ విమానాల రాకపోకలపై కూడా తీవ్ర ప్రభావం



ముందడుగు ముంబాయి:
ఎడతెరిపి లేని భారీ వర్షా లు ముంబై మహానగరాన్ని ముంచెత్తాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేని కుంభవృష్టి కురుస్తోంది. ఈ వర్షా నికి ముంబై మహానగరం జలమయమైంది. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రోడ్లు నదులను తలపిస్తున్నాయి. నగరం మొత్తం జలదిగ్బంధంలోకి వెళ్లిపోయింది. నగరానికి నీటిని సరఫరా చేసే సరస్సులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ముంబై మహా నగరానికి నీటిని సరఫరా చేస్తున్న ఏడు సరస్సుల్లో రెండు ఉప్పొంగి ప్రవహిస్తున్నట్లు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ తెలిపింది. మోదక్-సాగర్ సరస్సు, విహార్ సరస్సు పొంగిపొర్లుతున్నాయని పేర్కొంది. దీంతో సాయన్, చెంబూర్, అంధేరీ ప్రాంతాలపై తీవ్ర ప్రభావం పడింది. రానున్న రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షా లు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు పలు ప్రాంతాలకు శుక్రవారం వరకూ రెడ్ అలర్ట్ జారీ చేసింది. భారీ వర్షా ల కారణంగా విమానాల రాకపోకలపై కూడా తీవ్ర ప్రభావం పడింది. దీంతో ఎయిర్ ఇండియా, ఇండిగో, స్పైస్‌జెట్ సంస్థలు ప్రయాణికులకు ముందస్తు హెచ్చరికలు జారీ చేశాయి. వర్షం కారణంగా విమానాలు ఆలస్యంగా రాకపోకలు సాగిస్తున్నట్లు పేర్కొన్నాయి



## విజయ్ సినిమాలో శ్రుతిహాసన్

శ్రుతిహాసన్ హీరోయిన్‌గా 15ఏండ్లు పూర్తి చేసుకుంది. ఆమె కథానాయికగా నటించిన తొలి సినిమా 'లక్' విడుదలై సరిగ్గా 15 ఏండ్లయింది. స్టార్‌కిడ్‌గా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చినా.. నిలదొక్కుకోవడానికి శ్రుతిహాసన్ చేసిన శ్రమ సాధారణమైనదికాదు. ప్రస్తుతం ఆమె చేతిలో నాలుగైదు సినిమాలున్నాయి. ఇదిలావుంటే విజయ్ 'GOAT' సినిమాలో శ్రుతిహాసన్ భాగం అయ్యింది. ఇందులో మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. మరి శ్రుతిహాసన్ పాత్ర ఏంటి? అనుకుంటున్నారా! ఇందులో శ్రుతి నటించలేదు. ఈ సినిమాకోసం ఓ పాటను పాడింది. సంగీత దర్శకుడు యువన్‌శంకర్‌రాజా ఆమెతో ఈ సినిమాలో ఓ పాటను పాడించారు. మరో పదిరోజుల్లో ఈ పాటను విడుదల చేయనున్నట్టు చిత్ర యూనిట్ ప్రకటించింది. తండ్రి కమల్‌హాసన్ మాదిరిగానే శ్రుతిహాసన్ కూడా బహుముఖ ప్రజ్ఞాశాలి. ఓ వైపు నటిగా, మరోవైపు గాయనిగా క్షణం తీరిక లేకుండా గడుపుతున్నది శ్రుతిహాసన్. రీసెంట్‌గా దర్శకుడు లోకేష్ కనకరాజ్‌తో కలిసి కూడా ఓ పాట పాడిందామె. ఆ పాటకు మంచి స్పందన వస్తున్నది.

ముందడుగు
శుక్రవారం,
26-7-2024,
హైదరాబాద్

# ఉచిత పథకాలపై రాష్ట్రాలు ఆలోచించాలి

- భవిష్యత్తు తరాలపై భారం మోపవద్దు
- నిర్మలా సీతారామన్ సంచలన వ్యాఖ్యలు



ముందడుగు ఢిల్లీ:
దేశంలోని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల కోసం అమలు చేస్తున్న ఉచిత పథకాలపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వివిధ వర్గాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న ఉచిత పథకాల్లో స్థిరత్వం తేవాల్సిన అవసరం ఉందని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఉచిత పథకాల అమలుతో భవిష్యత్ తరాలపై భారం మోపవద్దని తెలిపారు. 'మీరు (రాజకీయ పార్టీలు) ప్రకటించే ఉచిత పథకాలను ఈనాడు సమర్థించుకోవచ్చు. కానీ ప్రజాభిప్రాయం ప్రకారం పన్నుచెల్లింపుదారులకు జవాబుదారీగా ఉండాలి. మీరు కొందరు వ్యక్తుల నుంచి పన్ను వసూలు చేసి మరికొందరికి ఇస్తున్నారు. ఉచిత పథకాలకు అర్హులై ఉండాలి' అని పార్లమెంటులో కేంద్ర బడ్జెట్ సమర్పించిన మరుసటి రోజు టైమ్స్ ఆఫ్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.

ఏది ఏమైనా, ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం నుంచి తాగునీరు, విద్యుత్, ప్రాథమిక ఆరోగ్యం, విద్యారంగాలకు సరిపడా నిధులు కేటాయించాలని నిర్మలా సీతారామన్ తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే ఉచిత పథకాల నుంచి ఎవరైనా లబ్ధి పొందొచ్చు, కానీ ఇతర పన్ను చెల్లింపు దారులపై ప్రతికూల ప్రభావం ఏర్పడకుండా ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. నగదు బదిలీ పథకం, ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర ఐదు హామీలతో గతేడాది కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్న సంగతిని ఆమె గుర్తుచేశారు. 'కర్ణాటకలో ఏం జరుగుతుందో చూడండి. అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధుల్లేవని చెప్పకుండా ఎన్నికల హామీలను తప్పనిసరిగా గౌరవించాలి' అని అన్నారు.

# రైడింగ్ చేస్తూ బ్యూటీఫుల్ బైకర్ మృతి

## 'రష్యా మోస్ట్ బ్యూటిఫుల్ బైకర్'గా పాపులర్

ముందడుగు:
రష్యాకు చెందిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ తత్యానా ఓజోలినా.. తుర్కియేలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందినట్లు అక్కడి మీడియా కథనాలు వెల్లడించాయి. తన ఎరుపురంగు బీఎండబ్ల్యూ బైక్‌పై ట్రావెలింగ్‌కు వెళ్లిన ఓజోలినా. తుర్కియేలోని మిలాస్ ప్రాంతంలో ద్విచక్రవాహనం నడుపుతూ నియంత్రణ కోల్పోయారు. దీంతో ఎదురుగా వస్తున్న ట్రక్కును బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఆమె అక్కడిక్కడే మృతిచెందగా.. వెనుక కూర్చున్న తుర్కియే బైకర్ తీవ్రంగా గాయపడ్డారు. ఘటనపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఓజోలినా బైక్ నడుపుతుండగా.. మరో రైడింగ్ గ్రూప్ అడ్డుగా వచ్చిందని, దీంతో ఆమె సడెన్‌గా బ్రేక్ వేయడంతో ప్రమాదం జరిగిందని స్థానిక మీడియా కథనాలు





చెబుతున్నాయి. 38ఏళ్ల ఓజోలినా 'మోటోతాన్యా' పేరుతో బైక్ రైడింగ్‌పై వ్లాగ్‌లు చేస్తూ సోషల్ మీడియాలో తెగ పాపులర్ అయ్యారు. ఆమె ఖాతాలకు ఇన్‌స్టాలో 10లక్షల మంది, యూట్యూబ్‌లో 20లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా సాహసోపేతమైన రైడింగ్‌లు చేసే ఈ ఇన్‌ఫ్లుయెన్సర్‌ను 'రష్యా మోస్ట్ బ్యూటిఫుల్ బైకర్'గా అభిమానులు పేర్కొంటారు. ఈమెకు 13 ఏళ్ల కుమారుడు ఉన్నాడు.




# బస్ బిజినెస్ విభాగానికి హెడ్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించిన డైమ్లర్

ముందడుగు హైదరాబాద్:
డైమ్లెర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్, డైమ్లర్ ట్రక్ ఏజీ ("డైమ్లర్ ట్రక్") పూర్తి యాజమాన్యంలోని అనుబంధ సంస్థ కాగా, జులై 1, 2024 నుంచి జారీలోకి వచ్చేలా బస్ బిజినెస్ హెడ్‌గా అందముత్తు పొన్నుసామిని నియమిస్తున్నట్లు ప్రకటించింది. అందముత్తు పొన్నుస్వామి 2011లో డీఐసీవీతో తన ప్రయాణాన్ని ప్రారంభించగా, ఆటోమోటివ్ (ప్యాసింజర్ మరియు కమర్షియల్ వెహికల్) పరిశ్రమలో కార్యకలాపాల నిర్వహణలో ప్రత్యేకతలతో 35 ఏళ్లకు పైగా అనుభవాన్ని కలిగి ఉన్నారు. డైమ్లెర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు సీఈఓ సత్యకం ఆర్య మాట్లాడుతూ, "భారతదేశంలో బస్ పరిశ్రమ సుస్థిర వృద్ధిని సాధిస్తోంది. ఈ మధ్య కాలంలో వృద్ధి సాధిస్తున్న వాణిజ్య వాహనాల పరిశ్రమ పరిమాణంలో కీలక భాగం అయ్యేందుకు సిద్ధంగా ఉండగా, ఇందులో బస్సుల విభాగం ఒక కీలక పాత్రను పోషిస్తోంది అని ధీమా వ్యక్తం చేశారు.

# ఏ రెండు ప్రేమకథలు ఒకేలా ఉండవ్..

నారా రోహిత్ కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'సుందరకాండ'. ఇది ఆయన నటిస్తున్న 20వ చిత్రం కావడం విశేషం. వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకుడు. సంతోష్ చిన్నపోళ్ల, గౌతమ్‌రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మాతలు. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణదశలో ఉంది. నేడు నారా రోహిత్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ఈ సినిమాకు సంబంధించిన స్పెషల్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'No two love stories are the same' అని పోస్టర్‌పై ఉంది. ఇది వైవిధ్యమైన ప్రేమకథ అని మేకర్స్ చెబుతున్నారు. విర్తి వాఘని కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీదేవి విజయ్‌కుమార్, నరేశ్ విజయకృష్ణ. వాసుకి ఆనంద్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: ప్రదీష్ ఎం.వర్మ, సంగీతం: లియోన్ జేమ్స్, నిర్మాణం: సందీప్ పిక్చర్ ప్యాలెస్.



# మహిళను చెట్టుకు కట్టేసి గుడ్లతో దాడి

## అన్నమయ్య జిల్లాలో అమానుష ఘటన

ముందడుగు ఆంధ్రప్రదేశ్:
మహిళను గ్రామస్థులు చెట్టుకు కట్టేసి చిత్రహింసలు పెట్టారు. కొందరు మహిళలు కర్రలతో కొడుతూ కోడిగుడ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ అమానుష ఘటన అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం షికారిపాలెంలో జరిగింది. సదరు మహిళ ఇటీవల భర్త నుంచి విడిపోయి మరో పెళ్లి చేసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆమె తప్పుచేసిందంటూ పలువురు మహిళలు చిత్రహింసలు పెట్టారు. స్థానికుల సమాచారంతో వీరబల్లి పోలీసులు బాధితురాలిని పీఎస్‌కు తీసుకెళ్లారు. ఆమె నుంచి ఎస్సై ఫిర్యాదు తీసుకున్నారు.



అనంతరం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

ముందడుగు
శుక్రవారం, 26-7-2024, హైదరాబాద్

# గొంతు వణుకుతున్నా నిజమే మాట్లాడండి

## మరో ఆసక్తికరమైన ట్వీట్ చేసిన స్మితా సబర్వాల్

ముందడుగు హైదరాబాద్:
దివ్యాంగులపై ఆమె పెట్టిన పోస్టులపై నెట్టింట దుమారం రేగుతున్న సమయంలో.. స్మితా సబర్వాల్ మరో ట్వీట్ వదిలారు. "కెరీర్ అనేది ప్రజల్లోనే ప్రారంభమైనా.. వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం అనేవి వ్యక్తిగతంగానే పెంపొందుతాయి. గొంతు వణుకుతున్నా నిజమే మాట్లాడండి.." అంటూ ఇంట్రెస్టింగ్ ట్వీట్ చేశారు స్మితా సబర్వాల్. అయితే.. ఈ ట్వీట్, తాను అఖిల భారత్ సర్వీసెస్‌లో దివ్యాంగుల కోటా గురించి చేసిన కామెంట్‌కు కట్టుబడే ఉన్నానని.. ఏమాత్రం వెనక్కి తగ్గేదేలే అని చెప్పేందుకే చేసినట్టుగా తెలుస్తోంది. మరోవైపు.. తనను ఎంత మంది వ్యతిరేకించినా.. తను నిజమే మాట్లాడతానని.. వ్యతిరేకతను



ఎదుర్కొనే ఆత్మవిశ్వాసం తనకు ఉందని చెప్పకనే చెప్తున్నట్టు అర్థమవుతోంది. తనను వ్యతిరేకిస్తున్న చాలా మందికి సమాధానంగానే ఈ ట్వీట్ చేసినట్టుగా అర్థమవుతోంది. ఈ ట్వీట్‌తో పాటు ఆమె తన రెండు ఫొటోలను కూడా జత చేయటం గమనార్హం. కాగా.. స్మితా సబర్వాల్ చేసిన ఈ ట్వీట్ మీద కూడా నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు.

# ఈ మూడు విభాగాల్లో బంగారు పతకాలు పక్కా..?

## బాక్సింగ్, షూటింగ్, అథ్లెటిక్స్‌లో గట్టిపోటీ

ముందడుగు డెస్క్
ఒలింపిక్స్‌లో తమ ప్రతిభను చూపి సత్తా చాటాలనుకునే క్రీడాకారులు బరిలో దిగేందుకు సిద్ధమవుతున్నారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ మొత్తం 7 మెడల్స్ గెలిచింది. పురుషుల జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రా గోల్డ్ మెడల్ గెలిచాడు. మహిళల 49 కేజీల వెయిట్‌లిఫ్టింగ్ ఈవెంట్‌లో మీరాబాయి చాను, పురుషుల 57 కేజీల ఫ్రీస్టైల్ రెజ్లింగ్ పోటీల్లో రవి కుమార్ దహియా సిల్వర్ మెడల్స్ సాధించారు. మహిళల బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో పివి సింధు, మహిళల వెల్టర్‌వెయిట్ బాక్సింగ్ ఈవెంట్‌లో లోవ్లినా బోర్గోహైన్, పురుషుల 65 కేజీల ఫ్రీస్టైల్ రెజ్లింగ్‌లో బజరంగ్ పునియా, పురుషుల హాకీ జట్టు కాంస్య పతకాలు గెలిచారు. అయితే పారిస్ ఒలింపిక్స్‌లో మరిన్ని మెడల్స్ సాధించాలని అథ్లెట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు గ్రేస్‌నోట్ ప్రిడిక్షన్స్ ఈసారి పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ గెలవబోయే పతకాల సంఖ్యను అంచనా వేయలేదు. అయితే ఇండియా కచ్చితంగా ఐదు పతకాలు సాధిస్తుందని ఏజెన్సీ పేర్కొందంటూ ఆన్‌లైన్‌లో కొంతమంది ట్వీట్లు చేస్తున్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు బాక్సింగ్, షూటింగ్, అథ్లెటిక్స్‌లో ఒక్కో గోల్డ్ మెడల్ పాటు మరో రెండు సిల్వర్ మెడల్స్ గెలుచుకుంటుందని ట్వీట్స్‌లో పేర్కొన్నారు. ఈ అంచనాలు నిజమయ్యే అవకాశం ఉంది.

### అథ్లెటిక్స్

అథ్లెటిక్స్‌లో మరో గోల్డ్ మెడల్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన నీరజ్ చోప్రా, ఈసారి కూడా పారిస్‌లో గోల్డ్ మెడల్ సాధించవచ్చు. అలాగే 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజర్ అవినాష్ సేబుల్ కూడా సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. అతడు గోల్డ్ మెడల్ కంటెస్టెంట్.

### బాక్సింగ్

బాక్సింగ్‌లో ఇండియా నుంచి ఇద్దరు మహిళా ప్రపంచ ఛాంపియన్లు నిఖత్ జరీన్, లోవ్లినా బోర్గోహైన్ పోటీ పడుతున్నారు. అలాగే నిశాంత్ దేవ్, అమిత్ పంఘల్ కూడా మంచి ఫామ్‌లో ఉన్నారు. కానీ ఉమెన్ బాక్సర్స్ మరింత స్ట్రాంగ్‌గా ఉన్నారు.

### షూటింగ్

షూటింగ్‌లో కూడా భారత్ చాటా బలంగా ఉంది. గత రెండు ఎడిషన్లలో భారతదేశానికి ఈ ఈవెంట్లలో మెడల్స్ రాలేదు. కానీ ఈసారి మను భాకర్, సిఫ్ట్ కౌర్ సమ్రా, సరబ్జోత్ సింగ్ వంటివారు ఇతర దేశాల షూటర్లకు గట్టి పోటీ ఇవ్వనున్నారు.

# పాము కాటుతో మరణిస్తే పరిహారం

- కొన్ని రాష్ట్రాల్లో 24గంటల్లోనే చెల్లింపు
- ఆర్థిక సహాయం ఏలా పొందవచ్చు..
- ఇంకా కొన్ని రాష్ట్రాలు పరిహారం అమల్లో లేదు



ముందడుగు ప్రత్యేకం:
పాము కారణంగా ఒక్క భారతదేశంలోనే ప్రతి ఏటా 58000 మరణాలు సంభవిస్తున్నయని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. భారతదేశంలో 2000-2019 మధ్యకాలంలో దాదాపు 12 లక్షల మంది పాము కాటు కారణంగా మరణించినట్లు ఒక రిపోర్ట్ తెలిపింది. ఈ మరణాల్లో 97 శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే సంభవించాయంట. పాముకాటు కారణంగా మరణించేవాళ్లే పురుషులే ఎక్కువగా ఉన్నారని.. పురుషులు పొలాల్లో పనిచేయడం దీనికి ఒక కారణం అని ఆ రిపోర్ట్ చెబుతోంది.

అయితే భారతదేశంలోని కొన్ని రాష్ట్రాలు పాము కాటు వల్ల మరణించిన వారి కుటుంబాలకు పరిహారం ఇస్తాయని చాలామందికి తెలియదు. భారతదేశం వ్యవసాయ దేశం కావడం వల్ల అత్యధిక జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. అనేక రాష్ట్రాలు.. పొలాల్లో పాము కాటు కారణంగా సంభవించే మరణాలను విపత్తుగా ప్రకటించాయి. ఈ కారణంగానే పాము కాటుకు గురై మరణిస్తే బాధిత కుటుంబానికి ప్రభుత్వం పరిహారం అందజేస్తుంది.



### కేరళ

కేరళలో పాము కాటుతో మరణిస్తే ఆ రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారం ఇస్తుంది. గతంలో కేరళ ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు ఇచ్చేది. అయితే ఈ పరిహారం చాలా తక్కువని, దానిని రూ.5 లక్షలకు పెంచాలని కేరళ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

### ఉత్తరప్రదేశ్

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పాము కాటు వల్ల మరణాన్ని ప్రమాదంగా పరిగణిస్తోంది. యూపీలో పాము కాటుతో మరణిస్తే ప్రభుత్వం రూ.4 లక్షల పరిహారం అందజేస్తుంది. మరణించిన వ్యక్తి రైతు అయితే, రైతు బీమా పథకం కింద నష్టపరిహారం సొమ్ముతో కలిపి రూ.లక్ష అదనంగా కుటుంబానికి అందజేస్తారు.

### ఎలా క్లెయిమ్ చేయవచ్చు?

పాము కాటుకు గురై ఎవరైనా మరణిస్తే, నష్టపరిహారం పొందేందుకు బాధిత కుటుంబం దగ్గర పోస్టుమార్టం నివేదిక ఉండటం తప్పనిసరి. దీని ఆధారంగా కుటుంబానికి ఆర్థిక సహాయం పొందవచ్చు. అందువల్ల, సంఘటన జరిగిన వెంటనే కుటుంబ సభ్యులు పోస్ట్‌మార్టం చేయించడం చాలా ముఖ్యం. దీని తర్వాత సంబంధిత అధికారుల ద్వారా పేపర్ ప్రక్రియ పూర్తవుతుంది. ఇది విపత్తు వల్ల సంభవించిన మరణం కాబట్టి, రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుంది. నష్టపరిహారం మొత్తాన్ని 48 గంటల్లో బాధిత వ్యక్తి సమీప బంధువుల బ్యాంక్ అకౌంట్‌కు పంపుతుంది.

### బీహార్

2022లో బీహార్ ప్రభుత్వం..పాము కాటుతో ఎవరైనా మరణిస్తే మృతుల కుటుంబానికి రూ.4 లక్షల పరిహారం అందజేస్తామని ప్రకటించింది. ఏ సీజన్‌లో మరణం సంభవించినా కూడా పరిహారం అందుతుందని బీహార్ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎందుకంటే వర్షా కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో పాము కాటు, మరణాల సంఖ్య పెరుగుతుందని సాధారణంగా నమ్ముతారు. ఈ సీజన్‌లో పాములు పొలాలు లేదా తోటలలో మాత్రమే కాకుండా తరచుగా ఇళ్లలో కూడా కనిపిస్తాయి.

### తమిళనాడు

2013లో పాము కాటు కారణంగా ప్రాణాలు కోల్పోయిన నాలుగేళ్ల చిన్నారి కుటుంబానికి మద్రాస్ హైకోర్టు ఆదేశాల మేరకు తమిళనాడు ప్రభుత్వం రూ.లక్ష నష్టపరిహారం ఇచ్చింది.